
# శాంసన్ - డిలైలా

'జ్యేష్ఠ'



'రక్తి కెమికల్స్' లాకౌట్‌లో వుంది.

'రక్తి కెమికల్స్' లేబర్ యూనియన్ ఆఫీసు దెబ్బతిన్న తేనె పట్టులా వెలవెలపోతోంది. మొగాల ఎండా ఆకలి మసిలో దీనంగా, మౌనంగా, పాపం పుణ్యం ప్రపంచ మార్గం ఏమీ తెలియని అయిదారేదుల పాపల్లా తమ నాయకుల వద్దకు వస్తూ పోతున్నారు కార్మికులు. పిల్లలకి తిండి పెట్టలేని తల్లుల్లా నాయకులు వాళ్ళని సముదాయిస్తున్నారు, కసురుతున్నారు, తలలు బాదుకుంటున్నారు, చర్చలు చేస్తున్నారు. రక్తి కెమికల్స్ యాజమాన్యం వాళ్ళకి ఇంటర్‌వ్యూ కూడా ఇవ్వటం లేదు.

రెండు నెలల క్రితం ఆనాడు --

రక్తి కెమికల్స్ ఉషారుగా, యువ్వనోత్సాహంలా, బోయిలర్లు, టర్బైన్లు, పంప్‌లు, కంప్రెసర్లు, మోటార్లు, మెషిన్‌లు, కార్మికులు, సూపర్‌వైజర్లు, ఆఫీసర్లు, టెలిఫోన్లు అందరూ కలిసి శంకర్‌జైకిషన్ ఆర్కెస్ట్రాలా అందమైన అల్లరి చేస్తూండగా, యంత్రాల క్రమశిక్షణనీ, మానవ సృజనా శక్తినీ ప్రకటిస్తూ, గగనమంతా నిండి పొగ కమ్ముతున్న పొడుగాటి చిమ్నీల జయపతాకలతో జయమాలిని డాన్స్‌లా, ఒలింపిక్ మారథాన్ రన్నర్స్‌లా వచ్చేపోయే గూడ్స్ ట్రెయిన్ల చక్ర పద ఘట్టనలతో, శ్రమవేడికి ఉబ్బి పదింతలవుతున్న పెట్టుబడి ముమ్మురాలతో, ఆరువేల మంది కార్మికుల, ఉద్యోగుల పెంపుడు బిడ్డగా గారాలు, వయ్యారాలు పోలికిస్తూ, మానవ పరిణామం, జీవన వికాసం, నిత్య పురోగమనం వేయి గొంతుకలతో చాటుతూ, రాష్ట్రమంతటికీ శక్తి కేంద్రమై దేశ అంతర్జాతీయ వ్యాపారంలో భాగస్వామినిగా వెలిగిపోతుండగా --

ఇంట్లో ఈగలమోతగా, గ్రుతితోకవాటంగా, పరదాలో ఇల్లాలిలా, ఎన్నేళ్ళయినా యెదగని ఆదాయాలతో, అలసటతో, ఆకలితో, తమ శ్రమలో బాధనే తప్ప 'శ్రమైక జీవన సౌందర్యాన్ని' చూసి ఆనందించలేని కార్మికులు అద్దం లేని ఇంట్లోని అందమైన ఆడపిల్లల్లా, పెళ్ళికాని తల్లుల్లా బ్రతుకే బరువై బ్రతుకులు కొనసాగిస్తూండగా --

యూనియన్ నాయకులకీ మేనేజ్‌మెంట్‌కీ సంప్రదింపులు జరుగుతూండగా --

యూనియన్ నాయకుడు జగన్నాధం కాన్ఫరెన్స్ హాల్‌లోంచి బయటకు వచ్చి 'మెరుపు సమ్మె'కు పిలుపునిచ్చాడు. అది సరిగ్గా కార్మికులు 'షిఫ్టు' మారే సమయం. రెండో షిఫ్ట్ కార్మికులు మూసివున్న ఫ్యాక్టరీ గేట్ల కెదురుగా పోగై సిగరెట్లు, బీడీలు కాల్చుకుంటూ, ముతక హాస్యంతో చికాకుని మరచిపోతూ, కాడి మెడకి తగుల్చుకోడానికి సిద్ధమవుతుండగా --

'మెరుపు సమ్మె' నినాదాన్ని అందుకుని లోపలున్న కార్మికులు ఎక్కడి పని అక్కడ విడిచిపెట్టి, ఉత్సాహంగా నినాదాలు చేస్తూ కెరటాలుగా అవతలకి వెళ్ళిపోయారు. మెయిన్ గేట్ దగ్గర రెండు షిఫ్టులవాళ్ళూ ఏకమవడం, సమ్మె వార్త నలువైపులా పాకిపోవడం, ప్రక్కనే వున్న మైదానంలో సభ జరగడం... అంతా క్షణాల్లోనే. ఎక్కణ్ణించో ఒక మైక్‌సెట్ వచ్చి జగన్నాధం కాళ్ళ దగ్గర నిలపడింది. "కామ్రేడ్స్, మన ఐక్యతే మన శక్తి; గతంలో మనం ఎన్నిసార్లు సమ్మె చేసినా ప్రతిసారీ విఫలమయ్యాం. అందుకే ఈ మెరుపు సమ్మె అవసరమైంది. మనం మన వర్గ చైతన్యాన్ని సంఘీభావాన్ని ఇంత శక్తితో చూపితే తప్ప యజమాన్యం లొంగదు..." మాట మాటకీ కార్మికులు జయ జయ ధ్వనులు చేశారు.

నోటీసు ఇవ్వకుండా సమ్మె చేయడంలో 'థ్రిల్' వుంది, విజయావకాశం యెక్కువ. అదొక అహింసాయుత గెరిల్లా దాడి! యాజమాన్యం దాన్ని ఎదుర్కోలేదు. ఎందుకంటే 'రక్తి కెమికల్స్'లో ఉత్పత్తి అలాంటిది. అది ప్రవహిస్తూనే వుంటుంది -- ఇరవైనాలుగ్గంటలూ, మూడు షిఫ్టులూ. పనిలో ఒక్కగంట అవరోధం వచ్చినా కంపెనీకి లక్షల్లో నష్టం వస్తుంది. రసాయన ముడిపదార్థాల పాళ్ళు మారినా, ప్రెషర్లూ టెంపరేచర్లూ అటూ యిటూ అయినా తయారయ్యే సరుకు ఎందుకూ పనికిరాదు. పైగా ప్రమాదాల అవకాశం చాలా యెక్కువ. చూసే నాధుడు లేకపోతే ఎక్విప్‌మెంట్‌లో కొన్ని ప్రేలడమో, కాలడమో, కరగడమో, విరగడమో జరగవచ్చు.

అదే కార్మికుల ధీమా -- ప్లాంట్ ధ్వంసం కావటానికీ ప్రొడక్ట్స్ పాడవడానికీ అవకాశాలు పుష్కలంగా ఉంటంచేత యాజమాన్యం భయపడి కాళ్ళ బేరానికి వస్తుందని! మహా అయితే గంటో, అరగంటో బింకం చూపిస్తారు. తరువాత పనిలోకి రండని తమని బ్రతిమలాడతారు!

కాని వాళ్ళనుకున్నట్లుగా జరగలేదు. గంటల్లో కాదు సరికదా రోజులు గడిచాక కూడా యాజమాన్యం కరగలేదు.

కార్మికులు పని వదలి సమ్మెకు పోగానే భయంతో కొన్ని నిముషాలు 'మూర్ఛ పోయిన' యాజమాన్యం వెంటనే తేరుకుని రంగంలోకి దిగింది. మేనేజర్లతో సహా ఆఫీసర్లు, యూనియన్‌కి చెందని కొన్ని డజన్లమంది కార్మికులు, ఉద్యోగులు ప్లాంటంతా పరుగులు పెట్టారు. భద్రతా చర్యలు తీసుకున్నారు. సూట్లూ, టెరిలీన్ దుస్తులూ విప్పి పడేశారు. బనీన్లు, డ్రాయర్లు, తువ్వాళ్ళు ధరించి అర్జంటు పనులలో దిగిపోయారు. ముఖ్యంగా విదేశాల నుంచి వచ్చి ఎదురు చూస్తున్న ఓడలకి కావలసిన సరుకు తయారీ ఆగకుండా చూసుకున్నారు. రెండు గూడ్స్ రైళ్ళని నింపారు. 'విధేయుల'కు బస, భోజనం ఫ్యాక్టరీలోనే. జీతం మామూలు దానికి మూడు రెట్లు!

అలా గండం గడిచింది.

విజయ గర్వంతో నిషాతో యాజమాన్యం బిగిసి పోయింది. చర్చలు ఆగిపోయాయి. లాకౌట్ ప్రకటించారు.

రోజులు గడిచేకొద్దీ సమ్మెకట్టిన కూలీలు, సమ్మెకట్టిన కూలీల భార్యల బిడ్డల ఆకటి చీకటి చిచ్చుల హాహాకారం, ఆర్తారావం అంటే యేమిటో

ఊరంతటికీ తెలిసిపోయింది. ఫ్యాక్టరీ లోపల్నే నివసిస్తూ అత్యవసర ఉత్పత్తుల్ని కొనసాగిస్తున్న ఉద్యోగుల ఇళ్ల ముందర కార్మికులు నిరసన ప్రదర్శనలు చేస్తుంటే లాఠీ చార్జి జరిగింది. పని విసుగెత్తి రిలీఫ్ కోసం సినిమాకి వెళ్లిన ఇద్దరు అలాంటి విధేయులను తన్ని, బట్టలు విప్పేసి బజార్లో వాళ్లచేత పరుగులెత్తించిన పదిహేను మంది కార్మికుల్ని పోలీసులు అరెస్టు చేశార.

ఫ్యాక్టరీ చుట్టూ బందోబస్తు ఎక్కువైంది.

* * *

ఈ పరిణామాలకి జగన్నాధం కుమిలిపోయాడు. అతను ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు; కార్మిక, ఉద్యోగ సంఘాల జాయింట్ ఏక్షన్ కమిటీ ఛైర్మన్. అతను నిప్పులాంటి మనిషి అనీ, యూనియన్ నాయకుడైనా యాజమాన్యం డబ్బు అలా ఉంచి, కార్మికుల డబ్బుకూడా పైసా తినడనీ పేరుపడ్డాడు. అందుకే జీతాలు అందక తనవాళ్లందరూ (ఆరువేలమందీ) మాడిపోతుంటే చూడలేక పోతున్నాడు. యూనియన్ ఎంత ప్రయత్నించినా చర్చల కంగీకరించని యాజమాన్యాన్ని యెలా కలవడమో, లాకౌట్ యెలా ఎత్తించడమో అనునిత్యం ఆలోచిస్తూ నిద్రా తిండీ మానేసి క్షీణించిపోయాడు...

నడుస్తుంటే రోడ్లూ, ఇళ్లూ, చెట్లూ రవి నగాయిచ్ ట్రిక్కులు చేస్తున్న సినిమా దృశ్యాల్లా కనిపిస్తున్నాయి జగన్నాధం కళ్లకి. మనిషి తూలిపోతున్నాడు. ఎలాగో నడిచి రక్షిత కెమికల్స్ వ్యవస్థాపకుడు, సి అండ్ ఎండి అయిన కిషోర్‌సేన్ ఇల్లు చేరాడతను. 'రక్షిత భారతి' చాలా పెద్ద ఇల్లు. గేట్ దగ్గరే ఘూర్కా ఎదురై జగన్నాథాన్ని అడ్డేశాడు. ''సాబ్ లేడు ఇంటిలో''. జగన్నాధం కాంపౌండ్‌లోకి చూస్తూ ఉండిపోయాడు. అలా రెండు నిమిషాలు గడిచాయి.

ఒక నాజూకైన స్త్రీ కుక్కపిల్లలతో పరుగులు తీస్తూ ఆడుతోంది లాన్‌లో. ఆ లాన్ నిగనిగలాడుతున్న యవ్వనవతి జుట్టులా నీట్‌గా గర్వంగా ఆమె వొంటి వెలుగుల్లో మెరిసిపోతోంది. దాని మధ్యలో సూటిగా పోతున్న కారుబాట వుంది. బాట చివర గులాబీరంగు వేసివున్న మూడంతస్తుల మేడ; దానిచుట్టూ విరగపూసిన పువ్వులమొక్కలు.

నీరసంతో కళ్ళు బైర్లుకమ్మిన జగన్నాథానికి ఆ స్త్రీ ఎవరో తెలీలేదు. ఆమె మాత్రం ఒక కుక్కపిల్లని తరుముతూ గేట్‌వైపు పరుగెత్తుకొచ్చి జగన్నాథాన్ని చూడగానే ఆగిపోయింది. అతన్ని పోల్చింది. అరనిమిషంసేపు తటపటాయించి, తరువాత సరిగానేవున్న పైట సవరించుకుంటూ గేటుదగ్గరకొచ్చి అతనివైపు బిడియంగా నవ్వింది. గేటు తెరిపించి అతన్ని ఆహ్వానించింది.

జగన్నాధం గొంతు పెగుల్చుకుని ''నువ్వేనా భారతీ, కులాసా ?'' అన్నాడు. ''తప్పదుగా !'' నవ్వింది భారతి. ఇద్దరూ ఇంటి దిశగా నడిచారు.

భారతి కిషోర్ భార్య. జగన్నాథానికి కాలేజీలో క్లాస్‌మేట్. ఆమెకు అతనంటే హీరోవర్‌షిప్ వుండేది ఆ రోజుల్లో. ఇప్పుడామె ఒక లక్షాధికారి భార్య. అతను యూనియన్ రాజకీయాల్లో నలిగి నన్నుపడిన చిన్న ఉద్యోగి కావటంతో ఇద్దరూ కంగారుపడుతూ తడబడుతూ మాట్లాడుతున్నారు ఎన్నో యేళ్ల తర్వాత కలిసి.

లాన్‌లో పేముకుర్చీల్లో ఇద్దరూ కూర్చుని రెండు నిమిషాలు చిన్న చిన్న మాటలేవో చెప్పుకున్నాక, ''ఈ సమ్మె యేమిటి జగ్గూ. నోటీస్ లేకుండా మొదలెట్టారుట, దారుణం కదూ'' అంది భారతి అందంగా కళ్ళు చిట్లించి.

''తప్పులేదు. కిషోర్‌గారు మరోలా మా డిమాండ్లని అంగీకరించరు. అది సరేగాని రెండు నెల్లుగా లాకౌట్ సాగుతోంది. దివాలా తీయాలని ఆయన ఉద్దేశమా ?''

''ఇప్పుడవన్నీ యెందుకు జగ్గూ. నాకు ఫ్యాక్టరీ గొడవలేమీ తెలియవు'' అవలీలగా అబద్ధమాడింది భారతి. నిజానికి కిషోర్ ఏం తలపెట్టినా ఆమెతో క్షుణ్ణంగా చర్చిస్తాడు. ఆ చర్చలలోనే అతనికి తన ఉద్దేశాలూ, ఆలోచనలూ స్పష్టంగా తెలుస్తాయి.

జగన్నాధం ఒకప్పుడు ఆమె హీరో. భారతి ఒక సామాన్య ఉద్యోగుల కుటుంబంలో పుట్టింది. ఇంట్లో స్థితి దుర్భరంగా వుండేదామెకు. ఇంట్లో అందరూ ఎప్పుడూ డబ్బు సమస్యలు, ఆచారాలు, సంప్రదాయాలు, అప్పులు, వడ్డీలు, పెళ్లిళ్ళు, లాంఛనాలు . . అవే మాట్లాడుతూ నిట్టూరుస్తూ అడపాతడపా యేడుస్తూవుండే రోజులవి. కాలేజీ వాతావరణమూ అంతే.

జీవితం ఆముదంలో ఈదుతున్నట్లుండేది. నూతిలో కప్పలా, కుళ్ళు కాలువలా వున్న తన జీవితంలోకి ఊహించని వెలుగూ, మరో ప్రపంచమూ తెచ్చాడు జగన్నాధం ఓ రోజున కాలేజీ వేదికమీద, మరో లోకం నుంచి దిగిన మహావీరునిలా శ్రీశ్రీ గీతాలు ఆవేశంగా పాడుతున్న జగన్నాధాన్ని చూసి అప్రయత్నంగా, స్లీప్ వాకర్‌లా వేదికపైకి నడిచి పోయింది భారతి. అది సెక్స్‌ని మించిన ఆకర్షణ. మద్యపానాన్ని మించిన దివ్య మధుపానం. జగన్నాధం తొణక్కుండా తనపాట పాడేసి, ఆమెచేత మరో గేయం చదివించాడు.

అలా స్నేహితులై, సహచరులై వాళ్లిద్దరూ కాలేజీలో చదివారు. అంతటితో తెగింది తీగ. జగన్నాథం బియ్యే పూర్తిగా ఫెయిలయ్యాడు. భారతికి కిషోర్‌తో పెళ్లైంది. ఆమె సహకారంతో కిషోర్ చిన్న వర్క్‌షాప్ పెట్టాడు. పదేళ్ల తర్వాత 'రక్షిత కెమికల్స్' పుట్టింది వాళ్లకి. రక్షిత ప్రొడక్ట్స్ చాలా పరిశ్రమలకి – పేపర్, పెయింట్స్, ఔషధాలు వగైరాలు – కావాలి. కిషోర్ కొన్నేళ్లలో పెద్ద పారిశ్రామికవేత్త అయ్యాడు.

కిషోర్‌ని యెలాగో వొప్పించి కార్మిక సంఘంతో చర్చలకు పంపుతానంది భారతి. జగన్నాధం తృప్తిగా ఊపిరి పీల్చి సెలవు తీసుకున్నాడు.


* * *

రక్షిత కెమికల్స్ యాజమాన్యానికీ, యూనియన్ లీడర్లకీ మధ్య చర్చలు మొదలయ్యాయి. ఎంత చెట్టుకి అంతగాలి అన్నట్లు లక్షాధికారి కిషోర్ సేన్‌కి ఫ్యాక్టరీ లాకౌట్‌వల్ల కోటీశ్వరిత్వం దూరమవుతోందనే బెంగవుంది. ప్లాంట్ నడుస్తోంది. కాని 'మెయింటెనెన్స్' జరగటంలేదు, ఎప్పుడో ఉన్నట్టుండి చతికిలపడుతుంది. ఈ సంగతి అక్కడ సమావేశమైన అందరికీ తెలుసు. కాన్ఫరెన్స్ జరుగుతున్న కిషోర్ మేడమీది హాల్లో ఇరుపక్షాల వాళ్ళు విసురుతున్న బాణాలు అందుకే చాలా జాగ్రత్తగా కదులుతున్నాయి.

దేశంలోని మిగతా పెద్ద కెమికల్ ఇండస్ట్రీస్ ఇస్తున్న స్థాయికి తమ జీతాలను పెంచాలని ఉద్యోగుల, కార్మికుల డిమాండ్. అడిగినదాంట్లో సగమే పెంచుతామని యాజమాన్యం. కుస్తీ సుదీర్ఘంగా సాగుతోంది

ఉన్నట్టుండి ఉద్యోగుల సంఘపు జాయింట్ సెక్రటరీ అంబాజీ శాయాజీ శాలికర్ణి (ఏ యెస్ యస్) నిలపడి ఉద్రేకంగా ఉపన్యసించసాగాడు. అతను తీవ్రవాదిగా ప్రత్యేకతను పొందుతున్న

[42వ పేజీలో]



ఉద్యోగి : "ఇది కేపిటలిజం మరణవేదనలో వుండి దాని పొట్ట చీల్చుకుని సోషలిజం ఉదయిస్తున్న అసురసంధ్య — సారీ — యుగసంధి. మిస్టర్ కిషోర్, మీ ధనం — నిజానికి అది మీదికాదు, ప్రతి పైసా మా నెత్తురుది, చెమటది — మీ న్యాయస్థానాలు, రక్షకభటవర్గాలు మా విజయాన్ని ఆపలేవు. నడుస్తున్న ఫ్యాక్టరీని ఎలా వున్నదాన్ని అలా వదిలేసి వచ్చేశారు మా కార్మికులు. వాళ్ల సాహసం, చొరవ, సంఘీభావం అలాంటిది. మా సత్తా తెలిసింది కదా... అందుకే కొత్త రక్తాన్ని ఇంజెక్ట్ చేస్తున్నాను..." అంటూ. జగన్నాథమూ వాళ్లూ ఎంత ఆపినా అతను ఆగటంలేదు. వాళ్లకి తమ మెరుపు సమ్మె ఒక పీడకలలా వుంది. ఎందుకంటే అది ఫెయిలయింది. బుద్ధున్నవాడెవడూ తన ఓటమిని కావాలని శత్రువుకి గుర్తుచేయడు. అయినా ఏ. యస్. శాతకర్ణి సరిగ్గా ఆ పనే ఎందుకు చేస్తున్నాడో బోధపడక, చేతికందుతున్నట్లున్న రాజీ మళ్లీ దూరమవుతుందేమోననే భయంతో వాళ్ళు తల్లడిల్లిపోతున్నారు.

ఏ. యస్. యస్. అంత బాధ్యతారహితంగా ఎందుకు మాట్లాడుతున్నాడో మిగతా లీడర్లకి తెలీకపోవచ్చు కాని, కిషోర్‌సేన్‌కి దాని గుట్టంతా తెలుసు. ఎందుకంటే ఏ. యస్. యస్. అని పేరున్నా, శ్రమశీలత లేదు శాతకర్ణికి. కాగితానికి పిన్ను గుచ్చమని యిస్తే పిన్ను విరిచేసి కాగితం పీలికలు చేసేంత నేర్పుంది అతనికి. అతని ప్రతిభను గుర్తించి, విప్లవ పదజాలం నేర్పించి, ఉద్యోగుల యూనియన్‌లో దూర్చినవాడు కిషోర్! చర్చలని యిలా బెడిసికొట్టించడం వాళ్లిద్దరూ ముందుగా వేసుకున్న పథకమే.

ఏ. యస్. యస్. లెక్చర్‌ని 'బలవంతం'గా ఆపి ఉద్రేకంగా అతని ఆరోపణలను ఖండించాడు కిషోర్. ఆ ఉద్రేకంలో కొంత నిజం కూడా వుంది. ఎందుకంటే సమ్మె మొదలైన మొదటి గంటా యంత్రసామగ్రి నాశనమవుతుందనే భయంతో వణికిపోయాడు కిషోర్. ఇప్పుడు ఏ. యస్. యస్. యిచ్చింది కేవలం డ్రమెటిక్ 'క్యూ', అంతే. దాన్నందుకుని నిప్పులు కురిశాడు కిషోర్ — "మీరు దేశద్రోహులు. రక్షి కెమికల్స్ దేశసంపదని పెంచుతోంది; విదేశీ మారకద్రవ్యం తెస్తోంది మీ ఆరువేల మందికేకాక మరెందరికో అన్నం పెడుతోంది. దాన్ని శాబటేజ్ చేశారు మీరు. విద్రోహచర్యకై క్రిమినల్ కేస్ పెట్టొచ్చు మీమీద..." అలా తాండవమాడాడు.

యూనియన్ నాయకులు నోరెత్తలేకపోయారు. శాతకర్ణి లెక్చర్‌తో వాళ్ల తప్పు మరోసారి బయటకు వచ్చి యాజమాన్యానికి నైతిక విజయం వచ్చింది. "మేం జీతాలు పెంచుతాం. మీరడిగినంత కాదు. దివాలా తీయాలనే ఉద్దేశం లేదు మాకు. లాభాలు యీ విధంగా వున్నాయి..." అని కిషోర్ చెప్పుతుంటే జగన్నాథం తగ్గ అస్త్రం విసిరాడు. అదే ఎకౌంట్స్. కొందరు ప్రొఫెసర్ల సాయంతో కాస్ట్ ఎకౌంట్స్ స్టడీ జరిపించి కిషోర్ చూపే లాభాలకంటే కంపెనీకి ఎక్కువ లాభాలు వచ్చాయనే రిపోర్ట్ తయారుచేశాడు జగన్నాథం. ఆ ఫైల్‌ని చూడగానే కిషోర్ గుండె కొన్నిక్షణాలు ఆగిపోయింది.

# శాంసన్-డిలైలా

కాని అతను స్వయం కృషితో, ఎద్దు శ్రమతో, ఉడుం పట్టుదలతో, పులి నిర్దాక్షిణ్యతతో పైకొచ్చినవాడు వెంటనే తేరుకున్నాడు. "మీరు చేసిన సమ్మె విద్రోహ చర్యని ఒప్పుకుని, మరో పదేళ్లదాకా ఎలాంటి సమ్మెలూ జరపబోమని హామీ యిస్తేనే మన చర్చలు సాగుతాయి" అన్నాడు.

సభ అర్థాంతరంగా ముగిసింది.

* * *

ఆ మరునాడు జగన్నాథం తన బ్రహ్మచారి కొంపలో ఒక్కడూ వుండగా ఖరీదైన అమెరికన్ కారొకటి వచ్చి గుమ్మంలో ఆగింది. యూనిఫారంలో వున్న డ్రైవర్ వచ్చి శాల్యూట్ చేసి భారతి పిలుస్తోందని చెప్పాడు. ఎందుకో తెలీదన్నాడు. ఒక నిముషం తటపటాయించి కారెక్కాడు జగన్నాథం ...

లాన్‌లో రెండు సోఫాలమధ్య ఖరీదైన టీ టేబుల్ వుంది. దానిమీద 'రాయల్ శాల్యూట్' సీసావుంది. ఓ సోఫాలో భారతి వుంది. ఎదురుగా వున్నదాంట్లో జగన్నాథాన్ని కూర్చోమంది. 'బోయ్' వచ్చి బొటిల్ మూతతీసి గ్లాసులు నింపివెళ్లాడు.

త్వరలో
రాగలహరి
సీరియల్

తన గ్లాసు సుతారంగా పట్టుకుని గాలిలోకి ఎత్తి 'ఛీర్స్' అని సిగ్గుగా నవ్వింది భారతి. జగన్నాథానికి మద్యం రుచి తెలుసు. కాని అభిరుచి లేదు. "ఏమిటిది" అన్నట్లు చూశాడు. "తీసుకో జగ్గూ. పార్టీ స్పిరిట్. ఇది మనిద్దరి పార్టీ. ఊఁ" అందామె. జగన్నాథం గ్లాసందుకున్నాడు.

జగన్నాథం నిప్పులాంటి మనిషి. అతను ఆకలితో కార్మికుల్ని మాడ్చి చంపుతున్న కిషోర్ భార్యతో కలిసి తాగుతాడంటే వింతగా కనిపిస్తుంది. కాని వార్తాపత్రికల్ని చదివి కాస్త ఆలోచించేవాళ్లకి వాస్తవమింతేనని తెలుస్తూనేవుంది. కాకపోతే దేశ దుస్థితికి కారణమేముంది? రాజకీయాలు, వర్తకాలు, వుద్యోగాలు, బహుమానాలు... యిలాంటి పర్టీలు లేకపోతే యింత విచిత్రంగా వుంటాయా!

"ప్రజలే యేలే రాజ్యం"లో ఆశ పోలేదు జగన్నాథానికి. ఎదురు చూస్తూనే వున్నాడు కూడాను — ప్రతి వృద్ధకన్యా తన వయస్సుని లెక్కచేయకుండా తనని ప్రేమించే శృంగార నాయకుడుండేవుంటాడని కలలుగంటున్నట్లు! అలా యిరవై యేళ్ళు ఎదురుచూడ్డంతో అతని ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం క్షీణిస్తూవచ్చాయి. అందుకే భారతి ఆహ్వానానికి తలవొంచాడు.

భారతి పైకి చాలా అదృష్టవంతురాలు, లక్షాధికారిణి. కాని ఆమె కాలేజీ రోజుల్లో జగన్నాథంతో పంచుకున్న భావాలలో పొందినలాంటి అతిలోకానుభూతి తరువాత లవలేశమైనా అనుభవించలేదు. ఇరవై యేళ్ల కాపురంలో ఆమెకు పిల్లలూ కలగలేదు. జీవితంలో పోగొట్టుకున్న నిషా కోసం ఆమె ఈ పార్టీ ఏర్పాటు చేసింది.

అరగంటలో ఇద్దరికీ పూర్తి నిషా వచ్చేసింది. కార్మికులతోబాటు తిండి యెగేస్తున్న జగన్నాథం ఒళ్ళు దీంతో గిరగిరా తిరగసాగింది. జగన్నాథమూ, భారతీ ఆ మైకంలో తమ బాధలనీ కలలనీ పంచుకున్నారు. జగన్నాథం చెప్పేశాడు: తమ మెరుపు సమ్మె 'పార్టీ' ఆదేశంపై జరిగిందనీ, ఎన్నికలు రాబోతున్నాయి కనుక ఇలా సమ్మె చేసి విజయం సాధిస్తే పార్టీ కేండిడేట్ గెలిచే అవకాశం పెరుగుతుందనీ, ఆదేశం వచ్చినందునే తానా సమ్మె చేయించాడు.

ఆ మాటలు చెవిని పడగానే భారతి నిషా మాయమైంది. ఆమె కళ్ళు ఎరని చూసిన పులి కళ్లలా మెరిశాయి. పార్టీ పూర్తయింది.

* * *

మూడురోజుల తర్వాత మళ్లా చర్చలు జరిగాయి. అస్త్రాలు, ప్రతి అస్త్రాలు, ఎత్తిపొడుపులూ, లెక్చర్లూ...అన్నీ యధావిధిగా సాగాయి.

"జీతాలు పెంచుతాం మా యిష్టం వచ్చినంత. మీరు మరో పదేళ్లదాకా సమ్మెలూ, ఆందోళనలూ జరపబోమని రాసివ్వాలి. లేకపోతే ఇంతే." అన్నాడు కిషోర్.

"ఆకలితో మాడుతున్న కార్మికుల ఓర్పుని పరీక్షకు పెట్టకండి. కంపెనీ లాభాల్లో వాళ్లకీ వాటావుంది. మీరు మరీ మొరాయిస్తే ఆరువేల మందీ ఒక్క మనిషిలా దూకుతారు రంగంలోకి..." జగన్నాథం బెదిరించాడు.

కిషోర్ మాట్లాడకుండా బ్రీఫ్‌కేస్ తెరచి అందులోంచి ఒక కాగితాల బొత్తి తీసి అందరికీ పంచాడు. అవి జగన్నాథానికి "పార్టీ" కేంద్రం నుంచి వచ్చిన సీక్రెట్ లెటర్ తాలూకు జెరాక్స్ కాపీలు. ఎన్నికలలో "పార్టీ" విజయం కోసం "తీవ్రచర్య" జరపమని దాని సారాంశం.

ఆ ఉత్తరాన్ని చదివిన యాజమాన్యం వాళ్లు పొంగిపోయారు. కాని తమ ఆనందాన్ని అణిచేసుకుని జగన్నాథాన్ని తిట్టసాగారు. "ఘోరం. మీరు చేసిన సమ్మె మీ పార్టీకోసమే తప్ప, కార్మికుల కోసం కాదన్నమాట! ఎంత దారుణం! కార్మికులు మాడి చచ్చినా ఫర్వాలేదు, మీకో పార్లమెంటు సీటొచ్చే మాటుంటే. ఎంత సినికల్!" యూనియన్ నాయకులలోని ఇతర పార్టీలవాళ్లకీ జగన్నాథంమీద కోపం వచ్చింది.

"ఈ రహస్యం ఎలా బయటపడింది? నేనెవరికీ చెప్పలేదే" అని గిజగిజలాడిపోయాడు జగన్నాథం. అతనికి భారతి ఇచ్చిన పార్టీ గుర్తురానేలేదు

రోడ్డుమీద వందలాది కార్మికులు పోగై "కార్మిక ద్రోహి జగన్నాథం ముర్దాబాద్" అని అరుస్తున్నారు. మేడ కిటికీలోంచి వాళ్లనీ, అక్కడ లేకపోయినా వాళ్లనలా అరిపిస్తున్న శాతకర్ణినీ తృప్తిగా చూసి, "జగన్నాథం! మీ కార్మికులు మీరు కావాలంటున్నారు. వెళ్లారా" అని గేటు చూపించాడు కిషోర్‌సేన్. ★